సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 28 । నవంబర్ । 2023



హరహర మహాదేవ

కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు.

- 8లో



స్పందన వినతులు 182

కలెక్టర్ స్పందనకు 182 వినతులు అందాయి. కలెక్టర్, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు.

- 8లో

డయల్ యువర్ డీఎంకు ఏడు వినతులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీపీటీఓ కార్యాక్రమానికి ప్రయాణికుల నుంచి ఏడు వినతులు వచ్చాయి. డీపీటీఓ విజయ్‌కుమార్ పాల్గొని విన్నపాలు విన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి బస్‌లు నడిపేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

సాధికార దీపిక



వైఎస్సార్ విగ్రహానికి నేతల నివాళి

సచివాలయ సందర్శన




సిబ్బందితో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

ఎచ్చెర్ల: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఎచ్చెర్లలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న ఆయన లావేరు మండలంలోని బుడుమూరు సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి రైతుల వివరాలు, రైతు భరోసా పంపిణీ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ ఈకేవైసీ చేయించాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని పేర్కొన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ కా లువ ద్వారా వచ్చే నీరు రైతులకు అందేలా మినీ రిజర్వాయర్ నిర్మించాలని కోరారు. ఇ లా చేస్తే దాదాపు ఏడు పంచాయతీలకు సమృద్ధిగా నీరందుతుందన్నారు. ఆయనతో పాటు మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కల్యాణి, స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు ఉన్నారు.

సైడ్‌లైట్స్

- సామాజిక సాధికార యాత్రకు పైడి భీమవరం గ్రామం మొదలు ప్రతి జంక్షన్ వద్ద ప్రజలు పెద్ద ఎత్తున హారతులు పట్టారు.
- రణస్థలంలో వంగపండు ఉష టీం ఆట పాటలు ఉర్రూతలూగించాయి.
- సుభద్రాపురం జంక్షన్ వద్ద బస్సుపై పూలవాన కురిపించారు.
- బుడుమూరులో భారీగా జనం తరలివచ్చారు.
- చిలకపాలెంలోని సభా ప్రాంగణం వద్ద జై జగన్ పాటలు మార్మోగిపోయాయి.
- పొందూరు రహదారి అంతా వైఎస్సార్‌సీపీ పోస్టర్లు, ఫ్లెక్సీలతో నిండిపోయింది.



పేదల కన్నీళ్లు తుడిచిన ప్రభుత్వం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల కన్నీళ్లు తుడుస్తోంది. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు, మండలంలో పీహెచ్‌సీలు, జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్నం భోజనం, జగనన్న విద్యా దీవెన వంటి పథకాలతో విద్య బలోపేతమైంది. ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలను నెరవేర్చిన ప్రభుత్వాన్ని కొనసాగించుకుంటామా, మాయ మాటలతో మోసం చేసే బాబును తెచ్చుకుంటామా అన్నది ప్రజలు ఆలోచించాలి.ఉత్తరాంధ్ర ప్రజలంతా విశాఖ రాజధానిగా కోరుకుంటున్నారు. టీడీపీ నాయకులు మాత్రమే వద్దంటున్నారు. సీఎం జగన్ తన పాలనలో కులాలు, మతాలు, వర్గాలను చూడటం లేదు. కానీ చంద్రబాబు మాత్రం వర్గాలు చూస్తూ జాతుల మధ్య విభేధాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. డ్వాక్రా సంఘాలు, రైతుల రుణాలు రుణమాఫీ చేస్తామని బాబు చేసిన మోసం ఇంకా ఎవరూ మర్చిపోలేదు. వారికి అధికారమిస్తే మన పీక మనం కోసుకున్నట్టే. - ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ శాఖ మంత్రి

అభివృద్ధి చూడండి.. ఆశీర్వదించండి..



రూ. 365 కోట్లతో బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నాం. మంచినీళ్లపేటలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ మంజూరు చేశారు. మత్స్యకారులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ గల్లంతు కావాలి. లోకేష్ సీఎం వైఎస్ జగన్‌కు భయం చూపిస్తాడట. అవినీతి కేసులో తండ్రి అరెస్టయితే ఢిల్లీలో దాక్కున్న పిరికి వ్యక్తి లోకేష్. నీ బాబు వల్లే కాలేదు, నీవేం చేయగలవు. పేద ప్రజల జీవన ప్రమాణాలు మార్చిన ఘనత ప్రభుత్వానిదే. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు ఎవరి వద్ద చేయి చాపకూడదని జగన్ సంకల్పించి సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. పుట్టిన పిల్లాడి దగ్గర నుంచి పండు ముసలి వరకు సంక్షేమాన్ని అందిస్తూ చేయూతనిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమే. ప్రజలంతా ఆలోచించి జగన్‌ను సీఎంగా మరోసారి గెలిపించేందుకు ఆశీర్వదించాలి. - సీదిరి అప్పలరాజు, రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి

వైఎస్సార్‌సీపీకే జనం మద్దతు



అన్ని కులాల వారి ఆత్మ గౌరవాన్ని సీఎం వైఎస్ జగన్ కాపాడారు. అందుకే సామాజిక సాధికార యాత్రకు ఇంత మద్దతు లభిస్తోంది. రాష్ట్రంలో అణగారిన వర్గాలన్నీ ఏకమవుతున్నాయి. గతంలో వారికి జరిగిన అన్యాయాన్ని గుర్తించి జగనన్నకు మద్దతు పలుకుతున్నారు. అన్ని కులాలకు హక్కులు, రాజ్యాధికారం, సంపద ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. - తమ్మినేని సీతారాం, స్పీకర్

సంతృప్తికర పాలన



మేం సచివాలయ పరిధిలో పర్యటనలు చేస్తుంటే ప్రజలు ఒక్క సమస్య కూడా ప్రస్తావించడం లేదు. అందరూ సంతృప్తిగా ఉన్నారు. ప్రజలు అలోచించి రానున్న ఎన్నికల్లో ఓట్లు వెయ్యాలి. వెన్నుపోటు నాయకులను తిప్పికొట్టాలి. రాష్ట్రంలో 175 స్థానాల్లో విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుక ఇవ్వాలి. - గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

చిలకపాలెంలో ఎగసిన చైతన్య కెరటం



చిలకపాలెంలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఒక భాగం

పదునైన ప్రసంగాలు.. ప్రతిధ్వనించిన నినాదాలు.... కిక్కిరిసిన దారులు.. ఉప్పొంగిన గుండెలు.. కలగలిపి చిలకపాలెంలో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర దిగ్విజయమైంది. చిలకపాలెం-పొందూరు రోడ్డు జన ప్రభంజనానికి నిదర్శనంగా నిలిచింది. విపక్షాల కళ్లు తెరుచుకునేలా.. విమర్శకుల నోళ్లు మూతపడేలా జన ప్రవాహం కనిపించింది. చేసిన మంచిని వివరిస్తూ నాయకులు, పొందిన మేలును తలచుకుంటూ ప్రజలు కార్యక్రమాన్ని ఆద్యంతం ఆసక్తిగా మలిచారు. ఇక్కడ జరిగిన జనజాతర స్థానికంగా పార్టీ శ్రేణుల్లో జవసత్వాలు నింపింది.

ప్రభుత్వానిది జనబలం



వైఎస్ జగన్‌ది జనబలం. అది చూసి టీడీపీ భయపడుతోంది. జనాలకు మంచి చేసే ప్రభుత్వానికే వారు ఓటు వేస్తారు. సీఎం వైఎస్ జగన్ బడుగులకు బాసటగా నిలిచారు. టీడీపీ హయాంలో గిరిజనులకు మంత్రి పదవి కూడా ఇవ్వకపోతే, జగన్ ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారు. 65 ఏళ్లకు చంద్రబాబు పెన్షన్ ఇస్తే, 60 ఏళ్లకే జగన్ పింఛన్ ఇస్తున్నారు. కులం, మతం, రాజకీయం, వర్గాలు లేకుండా అందరికీ మేలు చేసేందుకే జగన్ పరితపిస్తున్నారు. - పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి



జిల్లాలో కిడ్నీ ఆస్పత్రి, వాటర్ ప్రాజెక్టు, మత్స్యకారుల కోసం ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నారు. బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని సీఎం తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుస్తున్నారు. - బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం ఎంపీ

సామాజిక అభివృద్ధి



సామాజిక అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుంది. అందుకే యాత్రలకు తండోపతండాలుగా జనం తరలివస్తున్నారు. విద్యుత్, వ్యవసాయ సమస్యలు లేకుండా చేశారు. ఆరోగ్య సురక్ష వంటి బృహత్తర కార్యక్రమాలను చేపడుతున్నారు. - కంబాల జోగులు, రాజాం ఎమ్మెల్యే

- ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల / జి.సిగడాం



సభా వేదికపై మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు. చిత్రంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు

జగనన్న రుణం తీర్చుకుంటాం..



జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే మాకు ఆసరా, సున్నావడ్డీ, రైతు భరోసా, వసతి దీవెన, చేయూత, వసతి దీవెన పథకాలతో సుమారుగా రూ.4లక్షల వరకు లబ్ధి చేకూరింది. మాలాంటి పేదలకు అండగా ఉన్న సీఎంకు ఓట్లు ద్వారా రుణం తీసుకుంటాం. - కె.బాలామణి, బయ్యన్నపేట, లావేరు



కోలాటం ప్రదర్శన

సామాజిక సాధికార బస్సుయాత్రకు తరలివచ్చిన జనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/ ఎచ్చెర్ల క్యాంపస్:

చిలకపాలెంలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. బడుగు, బలహీన వర్గాల ఉత్తేజం ఉవ్వెత్తున ఎగిసింది. జాతీయ రహదారితో పాటు చిలకపాలెం, పొందూరు రోడ్డులో పండగ వాతావరణం చోటు చేసుకుంది. గడిచిన నాలుగున్నరేళ్లలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్ర వర్ణాల పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు ఎచ్చెర్లలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర జన సునామీని తలపించింది. నియోజకవర్గంలోని రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల నుంచి బలహీన వర్గాల ప్రజలు వెల్లువలా తరలి వచ్చారు. బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా తరలివచ్చిన జనసందోహం మధ్యకు బస్సు యాత్ర వచ్చేసరికి చిలకపాలెం కిక్కిరిసిపోయింది.

ఆత్మీయ భేటీ..

బడుగు, బలహీన వర్గాల ఆకాంక్షలను నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని, ఇంతగా ఎప్పుడూ జరగలేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాల పేదలకు మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నేతలు గుర్తు చేశారు. ముందుగా వారు రణస్థలంలో కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు, మత పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అనుసరించిన విధానాలు, అందించిన పాలనను వివరించారు. దీంతో ఆయా వర్గాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తాము అన్నీ చూశామని, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిని మరిపించేలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం పార్టీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించి సామాజిక సాధికారత కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏమేం చేశారో వివరించారు.

15 కిలోమీటర్ల మేర బస్సు యాత్ర..

రణస్థలంలో సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ ప్రారంభమైన బస్సు యాత్ర వందలాది బైక్ ర్యాలీతో ముందుకు సాగింది. జాతీయ రహదారి పొడవునా ర్యాలీగా బస్సు యాత్ర జరిగింది. మార్గం మధ్యలో బుడుమూరు సచివాలయాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయం సేవలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్సు యాత్ర చిలకపాలెం వరకు సాగింది. దారి పొడవునా స్వాగతం పలికారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు, అభిమానులు వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుని ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. దాదాపు 15కిలోమీటర్లు జగన్ నినాదాలతో మార్మోగింది. నాలుగు గంటలకు సభ ప్రారంభం కావల్సి ఉండగా మధ్యాహ్నం 2.30 గంటలకే జన ప్రవాహం ప్రారంభమైంది. వేదిక ప్రాంగణమంతా కిటకిటలాడింది. బస్సు యాత్ర వచ్చేసరికి మరింత కిక్కిరిసింది. వేలాదిగా తరలివచ్చిన మహిళా లోకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆకట్టుకున్న నేతల ప్రసంగాలు..

సామాజిక సాధికార యాత్ర సభలో ప్రజాప్రతినిధుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రభుత్వం చేసిన మేలును, వివిధ వర్గాలకు అందించిన సంక్షేమాలను, మానవీయ దృక్పథంతో స్పందించిన తీరును మంత్రి ధర్మాన ప్రసాదరావు వివరించినప్పుడు బడుగు, బలహీన వర్గాలు ప్రజలు ఆసక్తిగా విన్నారు. పేదల కన్నీరును తుడిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నప్పుడు సభా ప్రాంగణం ఒక్కసారిగా హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది. ఇక, చంద్రబాబు చేసిన మోసాలు, బడుగు బలహీన వర్గాలను అవమానించిన తీరును మంత్రి సీదిరి అప్పలరాజు వివరించినప్పుడు ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర జనప్రభంజనంపై మాట్లాడినప్పుడు చప్పట్లతో మారుమోగింది. స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు తదితరుల ప్రసంగాలు మరింత ఆకట్టుకున్నాయి. యాత్రలో స్పీకర్, మంత్రులు, ఎంపీతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కల్యాణి, నర్తు రామారావు, పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, అనూష పట్నాయక్, పిల్లా సుజాత, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బెందాళం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



జగనన్నే ఆదుకున్నారు..

జగనన్న అధికారంలో వచ్చిన వెంటనే రైతు భరోసా ద్వారా ఆర్థిక సాయం చేశారు. నాకు వృద్ధాప్య పింఛన్ కూడా వస్తోంది. గతంలో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు. మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుంటాం. - పిన్నింటి సత్యంనాయుడు, రణస్థలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, విజయనగరం ఎంపీ బెల్లాన తదితరులు

'సామాజిక న్యాయం దిశగా పాలన'

రణస్థలం/ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ సీపీ పాలన సామాజిక న్యాయం దిశగా సాగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా రణస్థలంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. పరిపాలన వికేంద్రీకరణ, సాంఘిక భద్రత, సంతృప్తి విధానంలో సంక్షేమ పథకాల అమలు, మహిళా సాధికారిత లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో విజయమే తమ లక్ష్యమన్నారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమం నగదు పడుతుండడంతో విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అందుకే బాధ్యత లేని విమర్శలు చేస్తున్నాయని అన్నారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక న్యాయం చేసేలా పాలన సాగుతుందని అన్నారు. అన్ని వర్గాలకు ప్రభుత్వ పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో కులం, మతం, ప్రాంతం, లంచం, వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలనలో భాగస్వాములు చేశారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నర్తు రామారావు, పెనుమత్స సురేష్ రాజు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కార్పొరేషన్ల చైర్మన్లు పేరాడ తిలక్, అంధవరపు సూరి బాబు, పార్టీ నాయకులు కిల్లి కృపారాణి, పిరియా సాయిరాజ్, నెక్కల నాయుడుబాబు పాల్గొన్నారు.



మహిళా ప్రభంజనం



బహిరంగ సభకు తరలివస్తున్న మహిళలు



బైక్‌ర్యాలీలో ఉత్సాహంగా..



బస్సుయాత్రకు మహిళల ఆనంద స్వాగతం..



బస్సుయాత్రలో అభిమానుల బైక్‌ర్యాలీ

క్లుప్తంగా

రాజ్యాంగ పీఠికే స్ఫూర్తి



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత రాజ్యాంగ పీఠికను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో న్యాయాధికారులు, న్యాయశాఖ ఉద్యోగులతో రాజ్యాంగంలోని పీఠికను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన పెంచుకొని నిబద్ధతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, మెజిస్ట్రేట్లు కందికట్ల రాణిశ్రీ, భరణి పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు ట్యాబ్‌లు



ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్, జేసీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సహిత విద్య అభ్యసిస్తున్న సహిత విద్యార్థులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ట్యాబ్‌లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్న 160 మంది చిన్నారులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ జయప్రకాశ్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జిపురం యూత్ క్లబ్‌కు ప్రశంసలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బెజ్జిపురం యూత్ క్లబ్ వ్యవస్థాపకుడు ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ బెజ్జిపురం యూత్ క్లబ్‌ను ప్రశంసించడం అభినందనీయమని, మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి జిల్లాకి మంచి గుర్తింపు తేవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో బెజ్జిపుం యూత్ క్లబ్ వ్యవస్థాపకుడు ప్రసాదరావు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని కార్యాలయం కోరిన వెంటనే 1996 నుంచి బెజ్జిపురం యూత్ క్లబ్ సేవల వివరాలను అందజేసినట్లు తెలిపారు.ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు ఐడీ కార్డులు



ఐడీ కార్డులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లకు ఐడీ కార్డులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా సోమవారం అందజేశారు. ఐదు రోజుల శిక్షణ పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడీ కార్డులను దుర్వినియోగం చేయకుండా న్యాయ సేవాధికార సంస్థ ప్రతిష్ఠను దృష్టిలో పెట్టుకొని ఉచితంగా న్యాయ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సంరక్షణాధికారి ఎం.మల్లేశ్వరరావు, లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ తలే లక్ష్మణరావు, గార తహసీల్దార్ జన్ని రామారావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం రూ.6,76,695

టెక్కలి: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానానికి రూ.6,76,695 ఆదాయం వచ్చినట్లు ఉత్సవాల ప్రత్యేకాధికారి వి.వి.ఎస్.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శీఘ్రదర్శనం టికెట్ల ద్వారా రూ.2,25,000, శీర్షాభిషేకం టికెట్ల ద్వారా రూ.2,90,000, కేశ ఖండన టికెట్ల ద్వారా రూ.14,000, హుండీల ద్వారా రూ.1,47,695 ఆదాయం వచ్చినట్లు వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.42,541 అదనపు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

హరహర మహాదేవ..!



శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేటలో చంద్రమౌళేశ్వరస్వామికి లక్ష రుద్రాక్షలతో అలంకరణ

టెక్కలి: ఎండల మల్లికార్జునకు శీర్షాభిషేకాలు చేస్తున్న భక్తులు





శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్రునికి అభిషేకాలు

కార్తీకమాస రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీముఖలింగం మధుకేశ్వరుడు, రావివలసలోని ఎండల మల్లికార్జునుడు, శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలందుకుంటున్న స్వామివారు



టెక్కలి: రావివలస మల్లన్న ఆలయం ప్రాంగణం వద్ద భక్తజనం



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయం వద్ద భక్తుల రద్దీ

కలెక్టర్ స్పందన @ 182

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో వచ్చిన అర్జీలను అలసత్వం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 182 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు ఉంటే స్పందనలో గానీ, టోల్ ఫ్రీ నంబర్ 1902కు గానీ తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, డీఎస్‌ఓ వెంకటరమణ, డ్వామా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీలు

పోలీసు స్పందన @37

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 37 అర్జీలను ఎస్పీ రాధిక స్వీకరించారు. పాతపట్నం నియోజకవర్గం పిడిమి గ్రామానికి చెందిన 93 ఏళ్ల వృద్ధురాలు కలమట అన్నపూర్ణ తనకున్న నలుగురు కుమారుల్లో ఇద్దరు కుమారులు పోషణార్థం చూడకపోయినా తనపేరిట ఉన్న భూమిని సాగుచేసుకుంటూ ఫలసాయం అనుభవిస్తున్నారని, పాలాన్ని విడిచిపెట్టమని అడిగితే దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులో ఉన్న వృద్ధురాలి పెద్దకుమారుడు కలమట నాగేశ్వరరావు రిటైర్డు డీఎస్పీ కావడం గమనార్హం. దీనిపై అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు స్పందిస్తూ సివిల్ సమస్యను కోర్టులో తేల్చుకోవాలన్నారు. బెదిరింపులపై పాతపట్నం సీఐతో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దరెల్లివీధి సమీపంలో వినాయకుని గుడి వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు అడిషనల్ ఎస్పీకి వినతిపత్రం అందించారు.



ఫిర్యాదు చేసిన 93 ఏళ్ల వృద్ధురాలు కలమట అన్నపూర్ణ

సంక్షేమ పథం



ఆదుకుంటున్న అమ్మఒడి



మాకు ఇద్దరి పిల్లలు. ఇంటర్మీడియెట్ చదువుతున్న పాపకు అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు జమ చేశారు. డిగ్రీ చదువుతున్న బాబుకు విద్యా దీవెన, వసతి దీవెన నిధులు మంజూరు చేశారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా పిల్లల చదువులు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎస్.విజయలక్ష్మి, పెంట గ్రామం, జి.సిగడాం మండలం

ఇల్లు మంజూరైంది..



మాలాంటి నిరుపేద కుటుంబాలకు జగనన్న దేవుడుతో సమానం. ఇన్నాళ్లు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడేవారం. గత ప్రభుత్వ హయాంలో నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా పక్కా గృహం మంజూరు చేశారు. ఆనందంగా ఉంది. – బత్తుల మీనాక్షి, సంతవురిటి, జి.సిగడాం మండలం

‘పల్లెగూటికి పండగొచ్చింది’ సినిమాను ఆదరించాలి

శ్రీకాకుళం అర్బన్: పల్లెగూటికి పండగొచ్చింది సినిమాను ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ కోరారు. సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను శ్రీకాకుళంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ పల్లెటూరుకి పండగ వచ్చింది సినిమా సమాజానికి సందేశం ఇచ్చే చిత్రమని చెప్పారు. దర్శకుడు కంచరాన తిరుమలరావు చెప్పిన కథ నచ్చి ఇందులో నటించినట్లు తెలిపారు. దర్శకుడు, నిర్మాత కంచరాన తిరుమలరావు మాట్లాడుతూ డిసెంబర్ 1న ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల వ్యాప్తంగా చిత్రం విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సినిమాలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు నటించారని తెలిపారు. అనంతరం జబర్దస్త్ దుర్గారావు డ్యాన్స్‌తో అలరించారు.

కార్యక్రమంలోనటులు రవితేజ, లవకిషన్, మురళీధర్, రోహిత్ కృష్ణ, నిగతాభాస్, జూనియర్ కృష్ణ, కె.ప్రసాద్, అమ్మ రామకృష్ణ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, సనపల అన్నాజీరావు, దుప్పల వెంకటరావు, డీపీ దేవ్, మొదలవలస రమేష్, పీఎంజే బాబు, చింతాడ రామ్మోహన్‌రావు, జె.జె.మోహనరావు, నటుకుల మోహన్, సురంగి మోహన్, పొన్నాడ రవికుమార్, డోల జగన్, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుమన్

మంత్రి సీదిరికి సత్కారం

కాశీబుగ్గ: రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును జిల్లా పశుసంవర్ధక శాఖ శస్త్రచికిత్సల వైద్యుల బృందం సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పశుసంవర్ధకశాఖ శస్త్రచికిత్సల వైద్యులు కొత్త అసోసియేషన్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో పలాసలో మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పి.హరికృష్ణ, కోశాధికారి లఖినాన కిరణ్, ఆఫీసర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ పోతనపల్లి చంద్రశేఖర్, జిల్లా గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సమాఖ్య అధ్యక్షుడు రాపాక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అప్పలరాజుతో సంఘ ప్రతినిధులు

జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తాచాటండి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లోనూ సత్తాచాటి పతకాలతో తిరిగి రావాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ వేదికగా డిసెంబర్ 1 నుంచి 3 వరకు జరగనున్న 37వ సబ్-జూనియర్, 6వ క్యాడెట్ జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్- 2023 పోటీలకు జిల్లా నుంచి తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికైన విషయం తెలిసిందే. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో ఆర్.నరేంద్రనాయుడు, డి.లీలామాధవ్, బాలికల విభాగంలో డి.త్రివేణి, పి.యషిత, బి.దేవీప్రియ, క్యాడేట్స్ బాలుర విభాగంలో కె.మోక్షిత్, టి.ఢిలేశ్వరరావు, ఎ.ప్రశాంత్, బాలికల విభాగంలో ఆర్.తన్మయ్ ఎంపికై న వారిలో ఉన్నారు. వీరంతా సోమవారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా క్రీడాకారుల బృందానికి అతిథులు, సంఘ ప్రతినిధులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు మాస్టారు, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కొమర భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్, గేదెల ఇందిరాప్రసాద్, శాసనాపు జోగినాయుడు, ఎస్.ఈశ్వరరావు, జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నరసింహులు, కురుటి తారకరామ, సకుముల శివాజీ, కొమర మోహన్‌కృష్ణ, పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో సాంబమూర్తి, సుందరరావు, కొమర భాస్కర్ తదితరులు

ప్రసాదరావుకు గోపాలరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గార మండలానికి చెందిన గోపాలమిత్ర ఎం.ప్రసాదరావు ఉత్తమ ఆర్టిఫీషియల్ ఇన్సెమినేషన్ టెక్నీషియన్ విభాగంలో గోపాలరత్న అవార్డు అందుకున్నారు. పాల విప్లవ పితామహుడు వర్గీష్ కురియన్ జయంతి, నేషనల్ మిల్క్‌డే సందర్భం సోమవారం గౌహతిలో జరిగిన కార్యక్రమంలో కేంద్రం పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల నుంచి అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్నవారిలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ శివ్వాల మన్మధరావు కూడా ఉన్నారు. వీరిని ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, జిల్లా జేడీ ఎం.కిషోర్, జగన్నాథం, జయరాజ్, రాజశేఖర్ అభినందించారు.

ఆడుదాం ఆంధ్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ‘ఆడుదాం ఆంధ్ర’ వాల్‌పోస్టర్, లోగోలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఆడుదాం-ఆంధ్రా పేరిట క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాలతో పాటు మారథాన్, యోగా, టెన్నికాయిట్ పోటీలు జరుగుతాయని చెప్పారు. 15 ఏళ్లు పైబడిన వారంతా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. టి.సి.ఎస్. కంపెనీలో బీపీఓ, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), కోజెంట్ ఈ సర్వీసెస్ కంపెనీలో బీపీఓ, నిట్ ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, ఇసుజు మోటార్స్, సియాన్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్ నుంచి బి.టెక్ వరకు చదివిన 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 9 గంటలకు చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9949094968 నంబరును సంప్రదించాలని జేకేసీ కోఆర్డినేటర్ వైమణికుమార్ తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు

రణస్థలం: క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, అర్హులందరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర ఎన్నికల ఎలక్టోరల్ పరిశీలకుడు జె.శ్యామలరావు సిబ్బందికి సూచించారు. రణస్థలం మండలం కోష్ట గ్రామంలో 182, 183 పోలింగ్ కేంద్రాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓలు రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలని, ఇందుకు ప్రతి కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ బి.పద్మావతి, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోష్ట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్యామలరావు

నేడు ఔట్‌రీచ్ కార్యక్రమం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి అహ్మద్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పలాసలోని కాజ్యూ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

లారీ చోరీ

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డులో సోమవారం మధ్యాహ్నం అనకాపల్లికి చెందిన శిల్పరశెట్టి నాగరాజుకు చెందిన లారీ చోరీకి గురైనట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సామగ్రి తీసుకువెళ్లేందుకు ఉపయోగిస్తున్న ఏపీ39టీ 9191 నంబరు గల లారీ మెళియాపుట్టి రోడ్డులో సోమవారం మధ్యాహ్నం పార్కు చేసి ఉంచారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లారీని పట్టుకుపోయారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ పోటీలకు రిఫరీగా మోహన్‌కృష్ణ



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ పోటీలకు రిఫరీగా శ్రీకాకుళం వాసికి అవకాశం లభించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వేదికగా డిసెంబర్ ఒకటి నుంచి మూడు వరకు జరిగే ఆలిండియా సబ్ జూనియర్స్, క్యాడెట్స్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు రిఫరీ(టెక్నికల్ అఫీసియల్)గా జిల్లాకు చెందిన కొమర మోహన్‌కృష్ణ నియామకం అయ్యారు. ఈ మేరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాని కార్యదర్శి ప్రభాత్ కుమార్ శర్మ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రిఫరీగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్న మోహన్‌కృష్ణ నియామకంపై పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

● వైభవంగా జ్వాలా తోరణం



బలగ నాగావళి తీరంలో బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం జ్వాలా తోరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో జ్వాలా తోరణాన్ని ఏర్పాటు చేయగా.. భక్తులు కోటి వత్తులను ఒకటిగా చేసి వెలిగించారు. – శ్రీకాకుళం కల్చరల్